# సేతువు

పి. మోహనరెడ్డి



**రెండేళ్ల ప్రశాంత్‌ను భుజంమీద వేసుకుని జోకొడుతున్నాడతను.**

తలుపువద్ద శబ్దమై అటు తిరిగి చూశాడు.

భయంగా తల వంచుకుని నిలబడిందామె.

"రా, గిరిజా!" పిలిచాడు పినాకపాణి.

తలెత్తి అతనివైపు చూసి మళ్లీ తల దించుకుంది కానీ, అక్కడనుండి కదల్లేదు. అంతకు ముందురోజు గుడిలో నిరాడంబరంగా జరిగిన వారి వివాహానికి సూచనగా ఆమె మెడలో పసుపుతాడు కనిపిస్తోంది.

"పాప ఏది?" అడిగాడు.

బేలగా చూసింది అతనివైపు.

"పాప ఎక్కడ ఉంది?"

అర్థంకాని భయం మనసంతా ఆవరించగా పమిటకొంగు చూట్టూ కప్పుకుని నిస్తేజంగా నిలబడి కిందకి చూస్తూ సమాధానమిచ్చింది "పక్క గదిలో ఉంది!"

"నాలుగు నెలల పసిపాప పడుకోవలసింది పక్క గదిలో కాదు! అమ్మ పక్కన!" ప్రశాంత్‌ను ప్రేమగా నిమురుతూ అన్నాడు.. "వెళ్లి పాపను తీసుకురా!"

ఆనందం ముప్పిరిగొనగా ఆశ్చర్యంతో చూసింది అతనివైపు.

"నేను వెళ్లి తీసుకురానా?" తలుపువైపు వస్తూ అన్నాడు.

"ఊహుఁ, నేను తీసుకువస్తాను!" ఒక్క అంగలో వెళ్లి నిద్రపోతున్న పాపను తీసుకువచ్చి మంచంమీద పడుకోబెట్టింది.

గాఢనిద్రలోకి వెళ్లిన ప్రశాంత్‌ను కూడా మంచంమీద పడుకోబెట్టాడు పినాకపాణి. ఇద్దరికీ దుప్పటి కప్పాడు.

"పాప పేరు అంజని కదూ?"

"అవును!"

"నువ్వు కూడా పడుకో, రేపు ఉదయమే మన ప్రయాణం!" మౌనంగా ఉన్న ఆమెవైపు చూస్తూ

అన్నాడు.

అతను తనవైపు చూడగానే కొంగు చుట్టూ లాక్కుని మంచం పక్కన ఉన్న కుర్చీలో ఒదిగి కూర్చుంది.

చుట్టూ తిరిగి మంచం అటువైపుకు వచ్చి, పిల్లలిద్దరినీ కొద్దిగా పక్కకు జరిపి ఆమెను పడుకోమన్నట్లుగా చూశాడు.

బేలగా, నిస్సహాయంగా అతనివైపు చూసింది.

"ఎందుకలా భయపడుతున్నావు నన్ను చూసి?"

ఆమెనుండి సమాధానం రాలేదు.

"వైవాహిక జీవితంలోని మాధుర్యాన్ని నేను నా భార్యతోనూ, నువ్వు నీ భర్తతోనూ చవి చూశామనడానికి ఈ పిల్లలిద్దరూ సాక్షి! నాకు నా భార్య తరచుగా ఎలా గుర్తొస్తుందో, నీకు నీ భర్త అంతే అని నేను అర్థం చేసుకోగలను!" గాఢంగా నిశ్వసించాడు పినాకపాణి. ఒక్క నిముషం మౌనంగా పిల్లలవైపు చూస్తూండిపోయాడు.

"ప్రశాంత్ తల్లి ప్రేమను కూడా పొందాలన్న ఆశతో రెండో పెళ్లికి అంగీకరించాను. అయితే నేను పెళ్లి చేసుకునే ఆమెకు కూడా ఇది రెండో పెళ్లి అయి ఉండాలని, నేను ఎలాంటి పరిస్థితుల్లో ఈ పెళ్లి చేసుకోవలసి వచ్చిందో, అదే పరిస్థితిలో ఉన్న ఆమె భార్య కావాలని పట్టుపట్టాను ...."

తల వంచుకుని అతని మాటలు వింటోందామె.

"నిన్న గుడిలో పెళ్లి జరుగుతున్నప్పుడే అనిపించింది అయిష్టతతో నువ్వు ఈ పెళ్లికి అంగీకరించావని!"

తలెత్తి అతనివైపు చూసింది. పిల్లలను చూస్తూ మాట్లాడుతున్న పినాకపాణి కూడా కొద్దిగా తల తిప్పి ఆమె వైపు చూశాడు.

"నన్ను పరాయి మనిషిగా భావించి భయంతో నువ్వు కాలం గడపనవసరం లేదు. బయోలాజికల్ నీడ్స్‌కోసం మాత్రమే మన పెళ్లి జరగలేదు. బాబుకు అమ్మ ప్రేమ, పాపకు నాన్న ఆదరణ అందించడానికి ఈ పెళ్లి జరిగిందని మనస్ఫూర్తిగా అనుకుందాం. మనకు ఒకరిపై ఒకరికి సంపూర్ణ విశ్వాసం కలిగినప్పుడు, పరస్పర అవగాహన ఏర్పడినప్పుడు ఆత్మబంధంతో కూడిన కలయిక జరుగుతుంది. అది కూడా ఇద్దరమూ ఇష్టపడినప్పుడే ...! సింహం బోనులో ప్రవేశించిన మేకపిల్లలా నన్ను చూసి భయపడుతున్నావని ఇదంతా చెప్తున్నాను. చాలా పొద్దుపోయింది, నిద్రపో!"

ప్రశాంత్ పక్కన చోటు చేసుకుని పడుకున్న పినాకపాణి మరునిముషంలో గాఢ నిద్రలోకి మునిగిపోయాడు.

నిశ్చలంగా కూర్చుందామె. ఈ వివాహం నిశ్చయమైనప్పటినుండీ అర్థంకాని ఆవేదనతో కల్లోలంగా ఉన్న ఆమె మనస్సు కొద్దిగా స్థిమితపడింది. ప్రశాంత్‌ను మృదువుగా స్పృశించి కనిపించని దైవానికి నమస్కరించింది 'పరమేశ్వరా! ఈ బాబును నా కన్నబిడ్డగా స్వీకరించి ఆదరించగల మానసిక శక్తిని, అనురాగాన్ని నాకు ప్రసాదించు!' నిద్రలో లేచి ఏడుస్తున్న అంజనిని సముదాయిస్తోంది గిరిజ.

గభాల్న నిద్ర లేచాడు పినాకపాణి. ఆశ్చర్యంగా ఆమెవైపు చూశాడు. "నువ్వు ఇంకా పడుకోలేదా?" అంటూ లేచి బెడ్‌లైట్ వేసి ట్యూబ్‌లైట్ ఆఫ్ చేశాడు. కిటికీ దగ్గరకు వెళ్లి బయటకు చూస్తూ నిలుచుండిపోయాడు.

పాప ఆకలి తీరాక మంచంమీద పడుకోబెట్టింది గిరిజ.

"ఎంతసేపని అలా కూర్చుంటావు, పడుకో!" అన్నాడు పినాకపాణి.

అలాగే కూర్చుండిపోయిందామె ఆ రాత్రి.

మర్నాడు ఉదయం

"మరో గంటలో బయలుదేరుతాము!" చెప్పాడు పినాకపాణి, మామగారితో.

"నాలుగు రోజులుండి వెళ్లండి బాబూ!" కళ్లజోడు తీసి పక్కనపెడుతూ అన్నాడాయన.

"ఊహుఁ, ఇవాళ వెళ్లాలి. మరోసారి వస్తాము!" అన్నాడు పినాకపాణి.

"పాప మా దగ్గర ఉంటుంది బాబూ! ఈ నాలుగు నెలల నుండి బాగా మాలిమి అయింది!"

"పాపను మాతో తీసుకువెళ్తాము. పాప తల్లితో ఉంటేనే బాగుంటుంది. గిరిజ నా భార్య అయిన క్షణంలోనే పాప కూడా నా బిడ్డే! అంజనిని కంటిరెప్పలా చూసుకుంటాను, సరేనా!" అన్నాడు పినాకపాణి.

గిరిజ తండ్రితోపాటు, లోపల గదిలో ఈ సంభాషణ వింటున్న గిరిజ తల్లి కూడా కృతజ్ఞతా భావంతో అతనికి మనసులోనే నమస్కరించి, వారిని సాగనంపారు.

000

గత జీవితం తాలూకు తీపిగుర్తులు బాధిస్తున్నా తమలోని ఉదాసీనత, నిరాసక్తత ఎదుటి వ్యక్తికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు గిరిజ, పినాకపాణి.

ప్రశాంత్, అంజని ఒకరికొకరు బాగా అలవాటయ్యారు. ప్రశాంత్ మొదట్లో ఆమె వద్దకు రాకపోయినా, ఆమె తన ఆలనా పాలనా చూడటం వల్ల, ఆమె కనులలో వర్షించే అపార మాతృ మమతకు వశుడయ్యాడు. గిరిజను "అమ్మా!" అని పిలవటం అలవాటయింది.

పినాకపాణి, గిరిజ పిల్లలిద్దరితో శ్రీశైలం యాత్ర చేసి వచ్చారు. ఆ తరువాత పినాకపాణి తల్లిదండ్రులు పల్లెనుండి వచ్చారు. ప్రశాంత్ ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండటం, గిరిజకు చేరువ కావడం పినాకపాణి తల్లి గ్రహించింది. మనుమడికి ఏ లోటూ జరగడంలేదని అర్థం చేసుకుని మనసులో ఆనందపడింది.


తమ వివాహం కుదిర్చింది వారే అయినా, తనంటే అత్తగారికి గల చిన్నచూపును గిరిజ అర్థం చేసుకుంది. పాపను ఆమె పరాయిపిల్లగా చూడటం, తనను ఎత్తిపొడుస్తూ మాట్లాడటం గ్రహించి మౌనంగా ఉండిపోయింది. తల్లి మాటలు విన్న పినాకపాణి పట్టించుకోవద్దన్నట్లుగా గిరిజకు సైగ చేసి, ధైర్యం చెబుతున్నట్లుగా ఆమె చేతిని స్పృశించాడు.

ఆ రాత్రి ఆమెతో అన్నాడు నెమ్మదిగా "అమ్మ మనసు చాలా మంచిది. కానీ ఇలాంటి సంఘటన ఆమె గతంలో చూడలేదు కాబట్టి అలా అంటోంది. సమస్యను మనవైపు నుండి కాకుండా ఎదుటి మనిషివైపు నుండి ఆలోచించడం అలవాటు చేసుకుంటే ఏ కలతలూ ఉండవు. కొంతకాలం తర్వాత అమ్మే అర్థం చేసుకుంటుందన్న నమ్మకం నాకుంది. అమ్మ మాటలకు నువ్వు బాధపడవద్దు!"

కన్నతల్లిని బాధించకుండా, కట్టుకున్న భార్య నొచ్చుకోకుండా ఊరడింపుగా మాట్లాడుతున్న అతన్ని చూసి హాయిగా నవ్విందామె.

నాలుగురోజులుండి అతని తల్లిదండ్రులు వెళ్లిపోయారు.

రెండు రోజుల తర్వాత ఆ వేళ ఉదయం లేవడంతోనే గిరిజ ఉదాసీనంగా ఉంది. ఇంట్లో పనులు చేస్తూనే నిస్సత్తువగా ఉంది. గుక్కపట్టి ఏడుస్తున్న పాపను, బాత్‌రూమ్‌లో నీళ్లతో



ఆడుకుంటున్న ప్రశాంత్‌ను గమనించే స్థితిలో లేదు.

పాపను ఎత్తుకుని, బాత్రూమ్‌లో నీళ్లు పారబోస్తున్న శబ్దం వినిపించి ప్రశాంత్‌ను తీసుకుని బెడ్రూమ్‌లోకి వెళ్లాడు.

గోడవైపు తిరిగి ముడుచుకుని పడుకుందామె.

"గిరిజా! ఒంట్లో బాగుండలేదా?" అనునయంగా అడుగుతూ ఆమె పక్కన కూర్చున్నాడు.

ఏడ్చి ఏడ్చి చారికలు కట్టిందామె ముఖం.

"ఏమైంది? ఏడుస్తున్నావెందుకు?" లాలనగా అడిగాడు.

ఉధృతంగా రోదిస్తోందామె. గిరిజను చూసి అంజని ఏడుపు లంకించుకుంది. ప్రశాంత్ బిక్కమొహం పెట్టాడు. పిల్లల్ని సముదాయిస్తూ మౌనంగా ఊరకుండిపోయాడు పినాకపాణి.

ఏడ్చి ఏడ్చి నిస్త్రాణగా అయిన గిరిజను "కొద్దిగా మంచినీళ్లు తాగు!" అంటూ మంచినీళ్లు పట్టాడు. ఆ తరువాత పాలగ్లాసు చేతికి ఇస్తే నెమ్మదిగా తాగింది.

"నిన్నెవరైనా ఏమైనా అన్నారా? ఏడుస్తున్నావెందుకు?" ఆమె ఏడుపు కొంచెం తగ్గిన తర్వాత అడిగాడు పినాకపాణి.

"... ..."

"మీ అమ్మను, నాన్నను చూడాలని ఉందా?"

అతనివైపు చూసిందామె.

స్నేహపూర్వకంగా ఉన్నాయి అతని చూపులు.

"ఈ వేళ .... ఈ వేళ ... శ్రీరామ్ చనిపోయిన రోజు ...!" ఆమె కళ్లలో నీళ్లుబికినాయి.

పినాకపాణికి బోధపడింది ఆమె రోదనకు కారణమేమిటో.

తాను తండ్రిని కాబోతున్నానన్న వార్త తెలిసి శ్రీరామ్ సంబరపడిన వైనమూ, ఆ మర్నాడే అతను ప్రమాదంలో ఎలా మరణించిందీ, తన ఆత్మహత్యా ప్రయత్నం, తల్లిదండ్రులు అడ్డుకోవడం .... పాప పుట్టడం .... మధ్య మధ్యలో ఏడుస్తూ చెప్పింది.

ఆమె పినాకపాణితో ఇంతసేపు మాట్లాడటం ఇదే మొదటిసారి.

ఆమె వేదన తీరి సంభాళించుకునే వరకూ నిశ్శబ్దంగా ఉండి, ఆ తర్వాత "నీ బాధ నేనర్థం చేసుకోగలను. మనిద్దరి గత జీవితానుభవాలూ ఒకటే. కానీ వీళ్లిద్దరికోసం మనం ఆనందంగా ఉండాలి!" ధైర్యం చెబుతున్నట్లుగా అన్నాడు.

ఆ రోజు ఆఫీసుకు వెళ్లలేదతను. వంట చేసి, పిల్లలకు స్నానం చేయించాడు. అంజనికి సెర్లాక్ పెట్టి, ప్రశాంత్‌కు అన్నం తినిపించాడు.

"మనం గత నెలలో శ్రీశైలం వెళ్లాం కదా! మనం అక్కడికి చేరిన రోజున మా పెళ్లి రోజు! క్రితం ఏడాది అదే రోజున అదే చోట లలిత, నేను, ప్రశాంత్ ముగ్గురం ఉత్సాహంగా తిరిగాము. కానీ ఈ ఏడాది మా పెళ్లి రోజున ఆమె జ్ఞాపకాలే మిగిలాయి ...!" పిల్లల్ని నిద్రబుచ్చుతూ అన్నాడు పినాకపాణి.

ఇద్దరూ మౌనంగా ఎవరి ఆలోచనలలో వారుండిపోయారు.

000

గిరిజ తండ్రి వచ్చి, గిరిజ పొలంమీద వచ్చిన పంటడబ్బు పినాకపాణికి అందించాడు. దాన్ని సుతారంగా తిరస్కరిస్తూ, "గిరిజ పేరుమీద బాంక్‌లో వేయండి!" అన్నాడు.

అతని వ్యక్తిత్వానికి, గిరిజ సంసారం చూసి తృప్తిగా నిట్టూర్చి, చేసేది లేక తిరిగి వెళ్లిపోయాడాయన.

ఉగాది పండగ వచ్చింది.

ఆ రోజు ఉదయం ప్రశాంత్‌కు, అంజనికి తల స్నానం చేయించి కొత్త బట్టలు వేసింది.

కళకళలాడుతున్న వాళ్లిద్దర్నీ చూసి దిష్టి తగులుతుందేమో అని భయం వేసి ఉప్పు నీటితో దిష్టి తీస్తున్న ఆమెను చూసి పినాకపాణికి నవ్వొచ్చింది.

"నువ్వు కూడా కొత్త చీర కట్టుకో!" వంట గదిలో చేరి అల్లరి చేస్తున్న పిల్లలను ముందు గదిలోకి తీసుకువెళ్తూ అన్నాడు.

తను చెప్పినా కూడా ఆ రోజు కొత్తబట్టలు ధరించని భార్యను చూసి గాఢంగా నిశ్వసించాడతను. గిరిజ మనసులోని ఒంటరితనాన్ని, నిరాసక్తతను, భయాన్ని ఎలా పోగొట్టాలో అర్థం కాలేదతనికి.

000

కాలమే కొన్ని సమస్యలను పరిష్కరించగలదు. అనుమానాలను, అపోహలను, భయాలను, సందిగ్ధాలను కాలమే నివృత్తి చేస్తుంది.

ఒక సాయంత్రం

పినాకపాణి ఆఫీసునుండి వస్తూనే అతను చకచకా సూట్‌కేసులో బట్టలు సర్దుకున్నాడు. గిరిజ ఇచ్చిన కాఫీ తాగుతూ "ఆఫీసు పనిమీద అర్జెంట్‌గా బెంగుళూరు వెళ్తున్నాను. తిరిగి వచ్చేటప్పటికి వారం పడుతుంది. వీళ్లిద్దరితో నువ్వు ఒక్కదానివీ ఉండగలవా?"

భయంగా చూసింది గిరిజ.

"పోనీ, మీ నాన్నను పిలిపించనా నీకు తోడుగా ఉండటానికి!"


వద్దన్నట్లుగా తల ఊపింది.

## మరో 'రింకూ'?

ఈ ఫోటోలో ముద్దులొలుకుతున్న ఓ పాప వుంది చూశారా? ఈమె పేరు సారాఖాన్. ఈ పాపను "నువ్వెవరిలా వున్నావమ్మా?" అనడిగితే చాలు, "నా కళ్లు మా నాన్నగారివి. నా ముక్కు అచ్చం మా అమ్మ ముక్కే. కాని నా నవ్వు మాత్రం నాదే!" అంటుంది. అంతబాగా తన పోలికలు తెలుసుకుందన్నమాట. కాని మరో విషయమూ వుందండోయ్. అదేమిటంటే, సారాకు కోపం వచ్చినప్పుడు కాని, ఏడిచేముందు కాని ఆమె కింది పెదవి అచ్చంగా ఆమె నాన్నమ్మ రింకూలాగే వణుకుతుంది. అంటే మరో రింకూ పుట్టిందన్నమాటేగా! ఇంతకూ ఈ రింకూ ఎవరనుకుంటున్నారా? అలనాడు కోట్లమంది ప్రేక్షకుల హృదయాలతోపాటు, నవాబ్ ఆఫ్ పటౌడీ మనసు కూడా దోచేసి, అతని భార్య అయి ఆయేషాబేగమ్‌గా పేరు మార్చుకున్న షర్మిలాటాగోర్. ఇటీవల 'మన్' చిత్రంలో హీరో అమీర్‌ఖాన్ నాన్నమ్మగా ఈ వయసులో కూడా ఎంతో ఇంప్రెసివ్‌గా నటించింది. మరి సారాఖాన్ భవిష్యత్తులో ఏమవుతుందో చూడాలి.

ఎస్.





బయలుదేరేముందు చెక్కుమీద సంతకం చేసి ఇస్తూ "డబ్బు అవసరమైతే డ్రా చెయ్యి!" అన్నాడు. అడ్రస్ ఉన్న కార్డు తీసి టేబుల్ మీద పెడుతూ, "అక్కడ నేను ఈ నంబర్‌లో ఉంటాను. అవసరమైతే ఫోన్ చెయ్యి!"

పిల్లలను ముద్దుపెట్టుకుని బయలుదేరిన అతని వెనకే గేటు వరకూ నడుస్తూ అంది గిరిజ "జాగ్రత్తగా వెళ్లిరండి!"

"అలాగే!"

000

వారం రోజుల తర్వాత పినాకపాణి తిరిగి వచ్చేటప్పటికి ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది.

జ్వరంతో నీరసించి మంచానికి అతుక్కుపోయి ఉన్నాడు ప్రశాంత్. పక్కనే ఉన్న టేబుల్ మీద ప్రిస్క్రిప్షన్, మందు సీసాలు ఉన్నాయి.

"నాలుగు రోజులనుండి జ్వరం. డాక్టర్ దగ్గరకు తీసుకువెళ్లాను. ఈ పూట కొద్దిగా ఫరవాలేదు!" చెప్పింది గిరిజ.

నిశ్శబ్దంగా స్నానం చేయడానికి బాత్రూమ్‌లోకి వెళ్తున్న అతన్ని హతాశురాలై చూసింది గిరిజ. భర్త ఏమంటాడో అని భయం! దుఃఖం పొర్లుకొచ్చిందామెకు. కింద ఆడుకుంటున్న పాపను ఎత్తుకుని, కనులవెంట నీరు కారుతుండగా చాలా సేపు అలాగే కూర్చుండిపోయింది.

స్నానం చేసి వచ్చి ప్రిస్క్రిప్షన్ చూశాడు పినాకపాణి. గిరిజ నోట్ చేసిన టెంపరేచర్ వివరాలు చూశాడు. నిద్రపోతున్న ప్రశాంత్‌ను ప్రేమగా స్పృశించాడు. అంజనిని ఎత్తుకుని గుండెలకు హత్తుకున్నాడు. కేరింతలు కొట్టింది పాప.

"మా కిద్దరకీ ఆకలవుతోంది, ఏమైనా పెట్టవూ!" అన్నాడు.

మనసు కాస్త కుదుటపడగా, జుట్టు ముడివేసుకుంటూ త్వరత్వరగా వంట గదిలోకి నడిచింది.

పది నిమిషాల తర్వాత అతను టిఫిన్ తింటూండగా అన్నది గిరిజ "ఫోన్ చేస్తే మీరు కంగారు పడతారని చేయలేదు!"

మౌనంగా ఆమెవైపు చూశాడు.

"మీరు వెళ్లాక ఇద్దరూ బెంగపెట్టుకున్నారు. బాగా విసిగించారు. ప్రశాంత్ నీళ్ల తొట్టెలో దిగి అల్లరి చేస్తుంటే కేకలు వేశాను. మర్నాటికే జ్వరం తెచ్చుకున్నాడు!"

ఆమెవైపే చూస్తున్నాడు కానీ, మాటా పలుకూ లేదు.

నిస్సత్తువగా కింద కూర్చుండిపోయిందామె. అతను ఊళ్లో లేని సమయంలో ప్రశాంత్‌కు జ్వరం రావడం, వచ్చాక అతను మౌనంగా ఉండటం ఆమెను కలతకు గురిచేసింది.

చేతులు కడుక్కుని పాపను ఎత్తుకుని వచ్చి ఆమె పక్కన, కింద కూర్చున్నాడు.

"మీరు ... మీరు నన్ను అనుమానిస్తున్నారా?" తల పక్కకు తిప్పుకుంటూ అంది.

"నిన్ను అనుమానిస్తే, నన్ను నేను అనుమానించినట్లే! చిన్నపిల్లలకు జ్వరం రావడం మామూలే. నువ్వెలా ఉన్నావో ఒక్కసారి అద్దంలో చూసుకో! అన్నం తిని, సరిగ్గా నిద్రపోయి ఎన్నిరోజులైంది ... ఊఁ..." చెదిరిన ఆమె ముంగురులు సరిచేస్తూ అన్నాడు.

"వచ్చినప్పటినుంచీ మౌనంగా ఉంటే కోపం వచ్చిందనుకున్నాను!" మెల్లగా అన్నది.

"ఓహ్...! అదా!..." నవ్వాడతను.

"ప్రయాణం చేసి వచ్చాను. ఆ చేతులతో పిల్లల్ని ఎత్తుకోకూడదని వెంటనే స్నానం చేశాను. ప్రశాంత్‌కు వచ్చిన జ్వరం గురించి నువ్వు సంజాయిషీ చెబుతుంటే ఆశ్చర్యం అనిపించింది!"

అతని మాటలకు రిలీఫ్‌గా అనిపించిందామెకు.

రెండు రోజులలో పూర్తిగా కోలుకున్నాడు ప్రశాంత్.

"రేపు ఉదయం గుడికి వెళ్దామా?" ఆ రాత్రి భోజనాలయ్యాక అన్నది.

తలూపాడు అంగీకార సూచకంగా.

మర్నాడు గుడికి బయలుదేరేటప్పుడు తల స్నానం చేసి కొత్త చీర కట్టుకుంది. ఆమెను చూసి "బాగుంది!" అన్నాడు.

బుట్ట తీసుకుని ఇటువైపు తిరిగిన గిరిజ పొడుగాటి జుట్టు కొసలు పాపను ఎత్తుకోబోతున్న పినాకపాణి ముఖానికి తగిలాయి. "... బాగుంది..." అన్నాడు మళ్లీ.

ఆశ్చర్యంగా అతనివైపు చూసింది గిరిజ.

"మొన్న ప్రశాంత్‌కు జ్వరం వచ్చినప్పుడు చాలా భయంగా అనిపించింది. జ్వరం తగ్గాక గుడికి వస్తామని వేడుకున్నాను!" దైవదర్శనమయ్యాక మెట్లమీద కూర్చుని పిల్లల్ని ముద్దు చేస్తూ అన్నది గిరిజ.

000

ఆదివారం సాయంత్రం ....

"గిరిజా!"

పిల్లలకు స్నానాలు చేయించి ముస్తాబు చేస్తున్న గిరిజ వెనుకకు తిరిగి చూసింది.

"నీకు ... నీకు ... ఇంకా పిల్లలు కావాలని ఉందా?"

"నాకు ఈ ఇద్దరు పిల్లలూ చాలు! మీకేమైనా కావాలని ఉందా?" ప్రశాంత్‌కు తల దువ్వుతూ హాస్యంగా ఉంది.

"ఊహుఁ, నాకు కూడా ఈ ఇద్దరూ చాలు!" నవ్వుతూ జవాబిచ్చాడు.

ఆ రాత్రి బెడ్‌రూమ్‌లో ...

"గిరిజా!"

"ఊఁ, చెప్పండి!" నిశ్శబ్దంగా ఉన్న అతనివైపు చూసింది.

"ఈ ఇద్దరూ చాలన్నావు కదా! నేను వాసెక్టమీ చేయించుకుంటాను, నువ్వు అంగీకరిస్తే!"

తల దించుకుందామె.

గిరిజ జవాబుకోసం ఎదురు చూస్తున్నాడతను.

కొద్ది నిమిషాల తర్వాత అంగీకార సూచకంగా తల ఊపింది.

లేచి వచ్చి ఆమె చేతులను తన చేతుల్లోకి తీసుకున్నాడు. ఆమె అరచేతులను ఇష్టంగా తన ముఖానికి తాకించుకున్నాడు క్షణకాలం. సన్నగా వణికిందామె. నెమ్మదిగా చేతులు వదిలాడు.

"పడుకో...!" అన్నాడు వెళ్లి కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదవడానికి ఉపక్రమిస్తూ.

నాలుగు వారాల తర్వాత

ఆ రాత్రి ... ఇద్దరు పిల్లల అమ్మా నాన్నలకూ ఆత్మబంధంతో కూడిన తొలి సమాగమం! వారి సమాగమనానికి సేతువైన ఆ చిన్నారులిద్దరూ ఆదమరచి నిద్రిస్తూండగా గదిలో వారికి కొద్ది దూరంగా ఆ దంపతులిరువురూ ఒకరిలో ఒకరు ఒదిగిపోయారు, కరిగిపోయారు, కలిసిపోయారు. ■

